క్లుప్తంగా

యువకుడి అదృశ్యంపై కేసు


లక్ష్మణ్ (ఫైల్)

సారంగాపూర్: మండలంలోని వంజర్ గ్రామానికి చెందిన తొంబరే లక్ష్మణ్ (21) గత నెల 31 నుంచి కన్పించడం లేదని ఆయన తండ్రి భురాజీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఏఎస్సై వసంత్ తెలిపారు. స్నేహితులను కలిసి వస్తానని ఇంట్లో చెప్పి తిరిగి రాలేదని.. బంధుమిత్రుల ఇళ్లలో వెతికినా ఆచూకీ దొరకలేదు. దీంతో శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నామని ఏఎస్సై పేర్కొన్నారు.

పాఠశాలకు కుర్చీలు అందజేత


అందించిన కుర్చీలతో దాత నరేశ్‌రెడ్డి

లక్ష్మణచాంద: మండలంలోని వడ్యాల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు అదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు నరేశ్‌రెడ్డి రూ.13 వేల విలువైన పది కుర్చీలను శనివారం అందించారు. దాత నరేశ్‌రెడ్డికి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అశోక్ వర్మ, సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.

'కులగణనపై అఖిలపక్ష సమావేశం నిర్వహించాలి'

నిర్మల్: జిల్లాల వారీగా బీసీ కులగణనపై అఖిలపక్ష సమావేశాలు ఏర్పాటు చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంబడి చంద్రశేఖర్ ఓ ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పార్టీల వారీగా సమావేశాలు నిర్వహించడం సమంజసం కాదని.. అఖిలపక్ష సమావేశం నిర్వహిస్తే కులగణనపై అన్ని రాజకీయ పార్టీల వైఖరి వ్యక్తం చేస్తాయని పేర్కొన్నారు.

పుస్తకాలు అందజేత


పుస్తకాలు అందజేస్తున్న నాయకులు

కడెం: మండల కేంద్రంలోని నల్లరాంరెడ్డి ప్రజా గ్రంథాలయానికి అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రసన్న హరికృష్ణ సమకూర్చిన గ్రూప్–2, ఇతర పోటీ పరీక్షలకు సంబంధించిన రూ.10 వేల విలువైన పుస్తకాలను శనివారం అందజేశారు. కార్యక్రమంలో జీజేఎల్ఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాదవ్ బలరాం, డీఆర్వో నజీర్ ఖాన్, హపవత్ రాజేందర్, శ్రీనివాస్, సుధాకర్‌రెడ్డి, రమణ, స్వామి, తదితరులున్నారు.

ప్రణాళికతో చదువుకోవాలి

లోకేశ్వరం: పదో తరగతి విద్యార్థులు పట్టుదల, ప్రణాళికతో చదువుకోవాలని ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు మల్కాగౌడ్ అన్నారు. శనివారం మండలంలోని మన్మద్ జెడ్పీ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన జెడ్ల నారాయణ రూ.8వేల విలువైన స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గంగాధర్, వినోద్, సుధీర్‌కుమార్, నవీన్‌కుమార్, గోదావరి, సౌజన్య ఉన్నారు.

కార్తీక పూజలు


దీపోత్సవంలో పాల్గొన్న మహిళలు

కుంటాల: కార్తీకమాసం ప్రారంభం సందర్భంగా కుంటాలలోని ప్రాచీన శ్రీకృష్ణ దేవాలయం, ఉమామహేశ్వర, మహాదేవుడి ఆలయం, ఓలా శివాలయం, సూర్యాపూర్ రాజరాజేశ్వరాలయాల్లో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. శ్రీకృష్ణ దేవాలయంలో మహిళలు దీపోత్సవంలో పాల్గొన్నారు. అర్చకుడు రామానుజదాస్ ఆధ్వర్యంలో పూజాది కార్యక్రమాలు చేపట్టారు.

మొరం పట్టివేత

ఖానాపూర్: పాత అనుమతి పత్రాలతో అక్రమంగా మొరం తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను శనివారం పట్టుకున్నామని తహసీల్దార్ శివరాజ్ తెలిపారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ పట్టణంలోని రెంకోని వాగుపై వంతెనల వద్ద మొరం కోసం గతంలో తీసుకున్న అనుమతులను రద్దు చేసుకున్నారని పేర్కొన్నారు. కాగా సదరు పాత అనుమతి పత్రాల జిరాక్స్‌లను చూపుతూ మొరం తరలిస్తున్నట్లు తమ దృష్టికి రావడంతో పట్టుకున్నామని అన్నారు. ఉన్నతాధికారులతోపాటు స్థానిక ఎస్సైకి వివరాలు అందించినట్లు పేర్కొన్నారు.

చార్జీల పెంపుపై హర్షం

ముధోల్: ప్రభుత్వం ఇటీవల డైట్, కాస్మెటిక్ చార్జీలను పెంచడంపై ముధోల్‌లోని గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. శనివారం సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతూ ప్లకార్డులు ప్రదర్శించారు. ప్రిన్సిపాల్ శిరీష తదితరులున్నారు.

తూకం వేసేదెప్పుడో?



ఈ చిత్రంలో కనిపిస్తున్న రైతు పేరు రాంగారి సాయారెడ్డి. లోకేశ్వరం మండలం అబ్దుల్లాపూర్‌లో తనకున్న ఆరు ఎకరాల్లో వానాకాలంలో వరి పంట సాగు చేశాడు. ఐదెకరాల్లో పొలం కోసి పది ట్రాక్టర్ల వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చాడు. 25 రోజులుగా ధాన్యాన్ని ఆరబెడుతున్నాడు. నిర్ణీత తేమశాతం వచ్చినా.. ఇప్పటికీ పంటను తూకం వేయడం లేదు. పంట తూకం వేయకపోవడంతో మిగిలిన ఎకరంలో పొలాన్ని కోయకుండా వదిలేశాడు. ప్రభుత్వం వెంటనే కొనుగోళ్లు చేపట్టాలని వేడుకుంటున్నాడు.


లోకేశ్వరం మండలం అబ్దుల్లాపూర్‌లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో ఆరబెట్టిన ధాన్యం

- 20 రోజుల కిందటే కొనుగోలు కేంద్రాలకు ధాన్యం
- కుప్పల వద్దే అన్నదాతల కావలా
- కలవరపెడుతున్న మబ్బులు.. వణికిస్తున్న చలి
- తేమశాతం వచ్చినా కాంటా పెడుతరలేరని ఆవేదన

లోకేశ్వరం: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు పంటను తెచ్చిన రైతులు అవస్థలు పడుతున్నారు. 20 రోజులవుతున్నా.. నిర్ణీత తేమశాతం వచ్చినా కాంటా పెడతలేరని కర్షకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఓవైపు మబ్బులు కలవరపెడుతుండగా.. మరోవైపు రాత్రి చలికి గజగజ వణుకుతున్నప్పటికీ పంట కుప్పలకు కాపలాగా రోజంతా కేంద్రాల్లోనే ఉండాల్సి వస్తుందని వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి.. నిర్ణీత తేమశాతం వచ్చిన పంటకు కాంటా పెట్టాలని రైతులు కోరుతున్నారు.

కొనుగోళ్లు చేపట్టాలి



మా ఊరిలో రెండు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినప్పటికీ తూకం వేయడం లేదు. ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చి వారం రోజులైతంది. రైతుల కష్టాల ను గుర్తించి వెంటనే కొనుగోళ్ల చేపట్టాలి. – మహేశ్వర్‌రావు, అబ్దుల్లాపూర్

త్వరలోనే ప్రారంభిస్తాం

అన్ని కేంద్రాల్లో త్వరలోనే కొనుగోళ్లు ప్రారంభిస్తాం. ఇప్పటికే కేంద్రాలకు రైతులు వరి ధాన్యం తరలించారని తమ దృష్టికి వచ్చింది. కొన్ని మండలాల్లో ఇప్పటికే కేంద్రాలను ప్రారంభించాం. మిగతా గ్రామాల్లో ప్రభుత్వ నిర్ణయం మేరకు ఏర్పాటు చేస్తాం. త్వరలో పంటను తూకం వేసి గోదాంలకు, మిల్లర్లకు అందజేస్తాం. – కిరణ్‌కుమార్, డీఎస్‌వో

90 కేంద్రాలు ప్రారంభం..

జిల్లాలో ఈసారి వానాకాలంలో లక్షా 25 వేల ఎకరాల్లో రైతులు వరిపంట సాగు చేశారు. ఈసారి పంట ఆశాజనకంగా ఉండడంతో కొనుగోలు కేంద్రాలకు 1లక్ష48 వేల మెట్రిక్ టన్నులకు పైగా ధాన్యం రావొచ్చని అధికారులు అంచనా వేశారు. గతంలో మాదిరి ఈసారి కూడా 287 వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. ఇప్పటికే ఆయా గ్రామాల్లో 97 కేంద్రాలను ప్రారంభించారు. రైతులు సైతం కేంద్రాలకు పంటను తీసుకొచ్చి 20రోజులకు పైనే అవుతోంది. నిర్ణీత తేమశాతం వచ్చినా కాంటా పెట్టడం లేదని కర్షకులు వాపోతున్నారు.

ఊపందుకున్న కోతలు..

జిల్లాలో వరికోతలు ఊపందుకున్నాయి. లోకేశ్వరం మండలంలోని అబ్దుల్లాపూర్, కన్కపూర్, లోకేశ్వరం, ధర్మోర, పంచగుడి, పిప్రి, గడ్‌చాంద, రాజూర తదితర గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలకు పంటను తీసుకొచ్చిన రైతులు 15 రోజులుగా ఆరబెడుతున్నారు. తేమశాతం వచ్చినప్పటికీ కొనుగోళ్లు ప్రారంభించలేదు. వర్షం కురిస్తే తమ కష్టం వరుణుడి పాలవుతుందని.. తూకం వేయాలని రైతులు కోరుతున్నారు.

అన్నదాత గోడు వినరూ..

ప్రభుత్వాలు మారుతున్నా.. అన్నదాతలకు మాత్రం కష్టాలు తప్పడం లేదు. కొనుగోలు కేంద్రాలను త్వరగా ప్రారంభించి రైతులకు ఇబ్బందులను దూరం చేస్తామంటున్న పాలకుల మాటలు నీటిమూటలవుతున్నాయి. ప్రభుత్వం కొనుగోలు చేయకుంటే తక్కువ ధరకు ప్రైవేటు వ్యాపారులకు విక్రయించాల్సి వస్తోందని కొందరు అన్నదాతలు కన్నీటి పర్యంతమవుతున్నారు. ఇప్పటికైనా మా గోసను పట్టించుకొని అధికారులు, పాలకులు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు. ఈనేపథ్యంలో కలెక్టర్ అభిలాష అభినవ్ ఇటీవల నిర్మల్‌లో రైస్‌మిల్లర్లతో సమావేశమై ధాన్యం మిల్లింగ్ వేగవంతం చేయాలని సూచించారు.

రేపు సీసీఐ కొనుగోలు కేంద్రం ప్రారంభం

భైంసాటౌన్: పట్టణంలో సోమవారం సీసీఐ కొనుగోలు కేంద్రం ప్రారంభించనున్నట్లు ఏఎంసీ ఉన్నత శ్రేణి కార్యదర్శి పూర్య నాయక్ తెలిపారు. ఉదయం 10:30 గంటలకు స్థానిక కాటన్‌యార్డులో ఎమ్మెల్యే రామారావు పటేల్ చేతుల మీదుగా కొనుగోళ్లు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. 8 నుంచి 10 తేమ శాతం ఉన్న పత్తికి క్వింటాలుకు రూ.7521 మద్దతు ధర ఉంటుందని.. రైతులు ఆధార్, బ్యాంక్ అకౌంట్ నంబర్, ఆధార్ లింక్ ఉన్న మొబైల్ నంబర్‌తో పత్తి విక్రయించవచ్చని పేర్కొన్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి కృషి

సారంగాపూర్: మత్స్యకారుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని పలువురు పేర్కొన్నారు. మండలంలోని జామ్ గ్రామంలోని మోర్‌చెరువులో ప్రభుత్వం వందశాతం రాయితీపై అందించిన 88 వేల చేపపిల్లలను శనివారం స్థానిక మత్స్యకారులు వదిలారు. జామ్ మత్స్యకార పారిశ్రామిక సహకారం సంఘం అధ్యక్షుడు కండెల భోజన్న మాట్లాడుతూ నాగమ్మ, కోమటి చెరువులకు చేపపిల్లలు పంపిణీ చేసేలా అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం కార్యదర్శి రాంపూర్ భోజన్న, ఉపాధ్యక్షుడు రమణ, డైరెక్టర్లు, మత్స్యకారులు ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత

ఖానాపూర్: పట్టణంలోని శివాజీనగర్‌కు చెందిన పెరుమాండ్ల హరీశ్‌గౌడ్ అనే యువకుడు ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని మాజీ మంత్రి ఐకే రెడ్డి పీఏ, ఖానాపూర్ వాసి ఒడ్డెపల్లి కృష్ణంరాజు పరామర్శించి రూ.10 వేలను ఆర్థికసాయంగా అందించారు. కార్యక్రమంలో వోకేఆర్ ఫౌండేషన్ సభ్యులు తదితరులు ఉన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే అమ్ముకోవాలి

- ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్

కుంటాల: రైతులు తమ పంటను ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే అమ్ముకొని మద్దతు ధర పొందాలని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని పెంచికల్‌పాడ్, విఠాపూర్ గ్రామాల్లో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు. మాజీ ఎంపీపీలు అప్క గజ్జారాంయాదవ్, జీవీ రమణారావు, ఏఈవో గణేశ్, నిర్వాహకులు గంగారెడ్డి, అశోక్, నాయకులు దిగంబర్‌పటేల్, చంద్రకాంత్, పసుల నవీన్, లక్ష్మీరమేశ్, లింగురాం పటేల్, లింగారెడ్డి, రవి తదితరులు ఉన్నారు.

భైంసారూరల్: మండలంలోని దేగాం, వాలేగాం, కుంసర, ఎగ్గాం, వానల్‌పాడ్, పేండ్‌పెల్లి గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే రామారావ్ పటేల్ ప్రారంభించారు. పీఏసీఎస్ చైర్మన్ దేవేందర్‌రెడ్డి, మాజీ మండలాధ్యక్షుడు రజాక్ తదితరులు పాల్గొన్నారు.

సారంగాపూర్: మండలంలోని జామ్, యాకర్‌పెల్లి, సారంగాపూర్, కొట్ల(బి), జౌళి గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏఎంసీ చైర్మన్ అబ్దుల్‌హాదీ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దళారులకు విక్రయించి నష్టపోవద్దని రైతులకు సూచించారు. ఏఎంసీ డైరెక్టర్లు పోతారెడ్డి, బట్టు భోజన్న, నాగారావు, నేరడిగొండ శ్రీనివాస్, ధన్‌సింగ్, పీఏసీఎస్ డైరెక్టర్ బాశెట్టి ప్రవీణ్, నవీన్‌రెడ్డి, రాము, లస్మన్న, సీఈఓ సలీం తదితరులు ఉన్నారు.


భైంసారూరల్ : వాలేగాంలో కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామారావుపటేల్


జామ్‌లో ప్రారంభిస్తున్న చైర్మన్ అబ్దుల్ హాదీ


ఖానాపూర్ : కేంద్రం ప్రారంభిస్తున్న నాయకులు

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్, రాజూరా గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఖానాపూర్ పీఏసీఎస్ చైర్మన్ ఇప్ప సత్యనారాయణరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం, తహసీల్దార్ శివరాజ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు దయానంద్, వెంకాగౌడ్, నిమ్మల రమేశ్, గాజుల గంగన్న, బిక్కి చిన్నరాజన్న, కామోజి శ్రీనివాస్, జంగిలి శంకర్, గుగ్లావత్ రాజునాయక్, రాచర్ల లక్ష్మణ్, ఎనుముల స్వామి, శేషాద్రి, నిట్ట రవి, నయీం, జహీర్, శైలేందర్‌రెడ్డి తదితరులున్నారు.

నిజాయతీ చాటిన ఆటోడ్రైవర్


మహిళకు పర్సు అందిస్తున్న ఆటోడ్రైవర్లు

కుంటాల: ఖానాపూర్ పట్టణానికి చెందిన రమాదేవి పని నిమిత్తం శనివారం కుంటాలకు వచ్చింది. తిరిగి ఖానాపూర్ ఆటోలో వెళ్తుండగా కుంటాల బస్టాండ్ ప్రాంతంలో పర్సు పోగొట్టుకుంది. ఈ పర్సు కుంటాలలోనే మరో ఆటోడ్రైవర్ భగత్ దశరథ్‌కు దొరికింది. పర్సులో ఏటీఎం, ఆధార్, ఓటరు ఐడీ, పాన్‌కార్డులతోపాటు రూ.9వేల నగదు ఉన్నాయి. పర్సులో డైరీ ఆధారంగా రమాదేవి కూతురుకు ఫోన్ చేశారు. కూతురు తల్లికి సమాచారం ఇవ్వడంతో కల్లూరు నుంచి వచ్చిన రమాదేవికి దశరథ్ పర్సు అందించి నిజాయతీ చాటుకున్నాడు. ఆటో డ్రైవర్లు జగన్, ఎగ్గం రవి, రాజు ఉన్నారు.

యువకుడి ఆచూకీ లభ్యం

కడెం: గత నెల 27న అదృశ్యమైన మండలంలోని పెద్దూర్ కొలాంగూడకు చెందిన కుమురం సంతోశ్ ఆచూకీ లభ్యమైంది. నాలుగు రోజులైనా సంతోశ్ ఇంటికి రాకపోవడంతో గత నెల 31న(గురువారం) కొలాంగూడ ఆదివాసీలు కడెం అటవీ రేంజ్ కార్యాలయం ముట్టడించి ఆందోళన చేశారు. దీంతో డీఆర్వోలు సిద్ధార్థ, ప్రకాశ్ ప్రత్యేక బృందాలుగా ఏర్పడి మూడు రోజులుగా సుమారు ముప్పైకి పైగా గ్రామాల్లో గాలింపు చర్యలు చేపట్టారు. ఆదిలాబాద్ జిల్లాలోని హత్తిగుట్ట గ్రామంలో బంధువుల ఇంట్లో ఉన్నాడని తెలుసుకొని అక్కడి నుంచి శనివారం సంతోశ్‌ను కడెం పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. రాత్రి కుటుంబసభ్యులకు అప్పగించారు. వారం రోజులుగా కనపడకుండా పోయిన సంతోశ్ ఇంటికి రావడంతో కుటుంబసభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.

నిరుపేదలకు వరం సీఎంఆర్ఎఫ్

కడెం: సీఎంఆర్ఎఫ్ పథకం నిరుపేదలకు వరమని.. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శనివారం మండలకేంద్రంలోని ఐకేపీ భవనంలో ఆయా గ్రామాలకు చెందిన 37 మంది లబ్ధిదారులకు రూ.8.22 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ. రోగికి అత్యవసర సమయంలో ఆపరేషన్‌కు అయ్యే ఖర్చును సీఎంఆర్ఎఫ్ (ఎల్ఓసీ)ను వెంటనే మంజూరు చేస్తామని పేర్కొన్నారు. అంతకుముందు లింగాపూర్‌లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సతీశ్‌రెడ్డి, మండలాధ్యక్షుడు మల్లేష్, నాయకులు గొళ్ల వెంకటేశ్, ముస్కు రాజు, శంకర్, సలీం, బొడ్డు గంగన్న, భూషణ్, కోల శ్రీను, చెన్ను మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.


దస్తురాబాద్: లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

దస్తురాబాద్: మండలంలోని రేవోజీపేట, మున్యాల, దస్తురాబాద్, బుట్టాపూర్ గ్రామాల్లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్ ప్రారంభించారు. అంతకుముందు మండల పరిషత్ కార్యాలయంలో 17 మంది లబ్ధిదారులకు రూ.5 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు.. ఎనిమిది మందికి కల్యాణలక్ష్మి చెక్కులు అందించారు.

దండారీలకు చెక్కులు అందజేత..

మున్యాల గోండుగూడలో నిర్వహించిన దండారీ ఉత్సవాల్లో ఎమ్మెల్యే బొజ్జు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఎనిమిది మంది దండారీలకు ఒక్కొక్కరికీ రూ.15 వేల చొప్పున మొత్తం ఎనిమిది మందికి అందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నవాజ్ సర్ఫరాజ్, ఎంపీడీవో రమేశ్, పీఏసీఎస్ చైర్మన్ రామడుగు శైలజ, ఏపీఎం గంగన్న, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు దుర్గం మల్లేశ్, నరేశ్‌రెడ్డి, సింగరి కిషన్, రమేశ్‌రావ్, శ్రీనివాస్, రంజిత్, రాజేశం, గోపాల్, నాగరాజు, రాయమల్లు పాల్గొన్నారు.

భైంసాలో సదర్ ఉత్సవాలు


ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే రామారావు పటేల్


దున్నపోతుతో ప్రదర్శనలో యువకుడు

భైంసాటౌన్: హైదరాబాద్‌లో ప్రత్యేకంగా నిర్వహించే సదర్ ఉత్సవాలు జిల్లాలోని భైంసాలోనూ చేపడుతున్నారు. పట్టణంలో శనివారం సదర్ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. పురాణబజార్‌లో యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఉత్సవాలకు ఎమ్మెల్యే పవార్ రామారావుపటేల్, సీఐ గోపీనాథ్ హాజరయ్యారు. మనకు ఉపయోగపడే పశువులను పూజించుకోవడం మన సంప్రదాయమని అన్నారు. అనంతరం పలువురు తమ దున్నపోతులతో నిర్వహించిన ప్రదర్శనలు అలరించాయి. కుమార్‌యాదవ్, నిర్వాహకులు సదానంద యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన దండారీ ఉత్సవాలు

ఖానాపూర్: దీపావళి పురస్కరించుకుని గిరిజన గ్రామాల్లో నిర్వహిస్తున్న దండారీ ఉత్సవాలు శనివారం ముగిశాయి. చివరిరోజు మండలంలోని అడవి సారంగాపూర్, జిల్లెడికుంట గ్రామాల్లో గుస్సాడీ నృత్యాలు చేశారు. ఆదివాసీ దేవుళ్లకు పూజలు చేశారు. అనంతరం ఉత్సవాలు ముగిసినట్లు పెద్దలు ప్రకటించారు.







సంక్షిప్త వార్తలు

'బీసీలకు అవకాశం ఇవ్వండి'

నిర్మల్‌టౌన్: త్వరలో జరిగే ఉమ్మడి కరీంనగర్ ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీ బిడ్డకు అవకాశం ఇవ్వాలని స్వతంత్ర అభ్యర్థి పోకల నాగయ్య అన్నారు. శనివారం నిర్మల్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. బీసీ బిడ్డగా ఎమ్మెల్సీగా బరిలో నిలుస్తున్న తమకు ప్రైవేట్ ఉపాధ్యాయ, నిరుద్యోగ సమస్యలపై పూర్తి అవగాహన ఉందని.. రాజకీయాలకు అతీతంగా మద్దతు ఇవ్వాలని కోరారు. ఈనెల ఆరో తేదీలోగా అర్హులు ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో టీఎల్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మెరుగు మధుకర్‌యాదవ్, రాష్ట్ర కార్యదర్శి అవుల రాజేశ్‌యాదవ్, గట్టు శ్రీనివాస్‌యాదవ్, వినయ్‌కుమార్ ఉన్నారు.

అధికారులకు బదిలీలు సహజం

నర్సాపూర్(జి): అధికారులకు బదిలీలు సహజమని ఎస్సై హన్మాండ్లు పేర్కొన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్సైలుగా పని చేసిన మాన్‌సింగ్, దేవేందర్‌గౌడ్‌లను శనివారం శాలువాతో సన్మానించారు. ఏఎస్సైలు మాన్‌సింగ్ దస్తురాబాద్, దేవేందర్‌గౌడ్ నిర్మల్‌రూరల్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీపై వెళ్తున్నట్లు పేర్కొన్నారు. వారి సేవలను కొనియాడారు. కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోండి

ముధోల్: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఓటరుగా అర్హులు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ శ్రీకాంత్ అన్నారు. శనివారం ఆయన తహసీల్దార్ కార్యాలయంలో మాట్లాడారు. గతంలో ఓటరు జాబితాలో పేరు ఉన్నప్పటికీ పట్టభద్రులు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులు నింపి తహసీల్దార్ కార్యాలయంలో అందించాలని పేర్కొన్నారు.

కేజీబీవీ విద్యార్థినుల ప్రతిభ

దిలావర్‌పూర్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం వరంగల్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి జూడో పోటీల్లో దిలావర్‌పూర్ కేజీబీవీ విద్యార్థినులు ప్రియాంక, శృతి ప్రతిభ కనబరిచారు. శనివారం పాఠశాలలో సదరు విద్యార్థినులను ఎస్‌వో అపర్ణ, పీఈటీ జయ, జూడో అసోసియేషన్ జిల్లా నాయకులు సాయికిరణ్, స్వామి అభినందించారు.

ఉపాధిహామీ గ్రామసభలు

నర్సాపూర్(జి): మండలంలోని టెంబుర్నిలో శనివారం ఉపాధిహామీ రెండో గ్రామసభ నిర్వహించారు. 2025–26 ఆర్థిక సంవత్సరంలో చేపట్టే ఉపాధి పనులపై చర్చించి రూ.81,82, 500 విలువైన బడ్జెట్ ఆమోదానికి ప్రతిపాదనలు తయారు చేసినట్లు టెక్నికల్ అసిస్టెంట్ సతీశ్ తెలిపారు. జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దత్తాద్రి, పంచాయతీ కార్యదర్శి శైలజ, ఎఫ్ఏ వెంకటేశ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


లోకేశ్వరం: మాట్లాడుతున్న ఎంపీడీవో వెంకటరమణ

లోకేశ్వరం: కూలీలు ఉపాధిహామీ పనులకు వెళ్లాలని ఎంపీడీవో వెంకటరమణ అన్నారు. శనివారం మండలంలోని పోట్‌పల్లి గ్రామంలో 2025–26 ఆర్థిక సంవత్సరంలో చేపట్టే ఉపాధి పనుల గుర్తింపు, ప్రణాళికల తయారీకి గ్రామసభ నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామసభలో మురికి కాలువలు, మట్టి పనులు, చెరువులో పూడికతీత, పంట కాలువల పనులకు ప్రణాళికలు సిద్ధం చేశారు. కార్యక్రమంలో టీఏ శారద, ఎఫ్ఏ భూమేశ్ ఉన్నారు.

చెక్కు అందజేత

కుభీర్: మండలంలోని రంజనికి చెందిన పుప్పాల హరిచరణ్‌కు రూ.38,500 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కు మంజూరైంది. శనివారం మాజీ ఎమ్మెల్యే జి.విఠల్‌రెడ్డి దేగాంలోని తన నివాసంలో లబ్ధిదారుడికి అందజేశారు. మాజీ ఎంపీపీ లక్ష్మిబాయి, శంకర్,దత్తురాం ఉన్నారు.